క్లుప్తంగా

రేపు రుణాల కోసం ఇంటర్వ్యూలు

రామాపురం/సుండుపల్లె : రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఈ నెల 18వ తేదీ మంగళవారం ఆయా మండల కేంద్రాలలోని ఎంపీడీ కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓలు జాషువా, సుధాకర్ రెడ్డి వేర్వేరు ప్రకటనలలో తెలియజేశారు. ఇంటర్వ్యూకి హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ఆధార్ కార్డు, కులం, ఆదాయం, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, రెండు ఫోటోలతో హాజరుకావాలని కోరారు.

22న మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ ఫణిరాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎంపిడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. ఇందులో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని తెలియజేశారు.

పేకాట స్థావరంపై దాడి

సుండుపల్లె : మండల కేంద్రంలోని కృష్ణానగర్ సమీపంలో కంపచెట్లలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ జూదం ఆడుతున్న 7 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 5,300 లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వాహనదారులు ధృవీకరణ పత్రాలు కలిగివుండాలి

పుల్లంపేట : మండల కేంద్రంలో ఆదివారం ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, పోలీసు సిబ్బంది ముమ్మరంగా వాహనాల తనిఖీ చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. అనంతరం ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధృవీకరణ పత్రాలు తమ వెంట ఉంచుకోవాలని తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, అలా నడిపితే వాహన యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

నాగారపమ్మకు పూజలు



అలంకారంలో నాగారపమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ ఆదివారం ప్రత్యేక పూజలందుకుంది. వేకువజామునే పూజారులు అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు సుబ్బయ్య యాదవ్

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్ట చెరువుకట్టపై ఉన్న శివాలయం వద్ద ఆదివారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు సుబ్బయ్య యాదవ్ విచ్చేశారు. ఈయన సమక్షంలో ఒంటిమిట్ట మండల దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఇందులో ఒంటిమిట్ట మండల అధ్యక్షులు చిట్టేటి రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కదిరి కడపయ్య, మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి గుర్రప్ప, మండల కార్యదర్శి పొత్తిరెడ్డి ఆలు మూరెయ్య, కోశాధికారి సుబ్బరాయుడులను ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బరాయుడు మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల కోసం పోరాడి సాధించుకునేందుకు ఈ పోరాట సమితి ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.

పరామర్శ



రామ్‌నాథ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న గడికోట

సంబేపల్లె : దేవపట్ల పంచాయతీ ఆవులవాండ్లపల్లెకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు రామ్‌నాథ్‌రెడ్డి భార్య కవిత ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో రామ్‌నాథ్‌రెడ్డి కుటుంబాన్ని ఆదివారం వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డిలతో కలిసి పరామర్శించారు. కవిత మృతి పట్ల శ్రీకాంత్‌రెడ్డి సంతాపం తెలిపారు.

స్వచ్ఛతకు తూట్లు.. ప్రజలకు అగచాట్లు

- కార్యాచరణలో కానరాని పారిశుధ్య చర్యలు
- మండల కేంద్రం పరిధిలో యథేచ్ఛగా చికెన్ వ్యర్థాలు డంపింగ్



సిద్దవరం మార్గంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద వేసిన చికెన్ వ్యర్థాలు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు బస్టాండ్ సర్కిల్‌లో ఉన్న చికెన్ సెంటర్ల యజమానులు వ్యర్థ పదార్థాలను సిద్దవరం వెళ్లే మార్గం నాలుగు రోడ్ల కూడలి వద్ద వేస్తుండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నాలుగు రోడ్ల కూడలి నుంచి ఎగువ సిద్దవరం, తిరుమలరాజుపేట, ఓబిలి, నడిమి సిద్దవరం, కంబాలకుంట గ్రామాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వ్యర్థ పదార్థాలు వేయడం వల్ల కుక్కలు గుంపులుగా అక్కడికి చేరుకొని ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఒకరిపై ఒకరు సాకులు చెబుతున్నారే తప్పా మాంసపు వ్యర్థాలను అక్కడ వేయకుండా నివారించలేదని ప్రజలు వాపోతున్నారు. ఇరవై కుక్కలకుపైగా ఆ వ్యర్థ పదార్థాలు తిని అక్కడే పడుకొని పశువులపైన, ఒంటరిగా వెళ్లే మనుషులపైన దాడులు చేస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ, మండల అధికారుల దృష్టికి తీసుకుకెళ్లినా స్పందన లేదు. పిల్లలతో ఈ మార్గం గుండా వెళ్లాలంటేనే భయమేస్తోందని మహిళలు పేర్కొంటున్నారు. స్వచ్ఛత పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే అధికారులు ఫిర్యాదులపై ఎందుకు స్పందించరని మండల కేంద్రం వాసులు ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాలుగు రోడ్ల కూడలిలో కాకుండే వేరే చోట చికెన్ వ్యర్థాలను వేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపైనే తిష్టవేసిన శునకాల గుంపు

ముక్కుమూసుకొని వెళ్తున్నాం



పెనగలూరు లేదా కంబాలకుంట నుంచి మా గ్రామం వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్తున్నాం. నాలుగు రోడ్ల కూడలి వద్ద రాగానే అర కిలో మీటరు దూరం నుంచి దుర్వాసన వెదజల్లడంతో భరించలేక ముక్కుమూసుకుంటున్నాం. ఈ మార్గంలో చికెన్ వ్యర్థపదార్థాలు వేయకుండా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలి.

– పెంచలయ్య, తిరుమలరాజుపేట, పెనగలూరు మండలం

కుక్కల భయం వెంటాడుతోంది



చికెన్ వ్యర్థాలు సిద్దవరం రోడ్డులో చికెన్ యజమానులు వేయడంతో అక్కడ దాదాపు 20 నుంచి 30 కుక్కలు ఆ వ్యర్థాలు తిని అక్కడే తిష్ట వేస్తున్నాయి. చీకటి పడగానే వాహనాలపై వెళ్తున్న ప్రజలు, నడిచి వెళ్తున్న ప్రజల వెంట పడుతున్నాయి. దీంతో కుక్కల భయం వెంటాడుతుంది. వెంటనే ఈ వ్యర్థ పదార్థాలు ఇక్కడ వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మల్లికార్జున, ఎగువ సిద్దవరం, పెనగలూరు మండలం

ప్రజలు తిరగనిచోట వేయాలి



ప్రజలు ఎవరూ తిరగనిచోట చికెన్ వ్యర్థాలు వేయాలి. రద్దీగా ఉండే నాలుగురోడ్ల కూడలికి ఇరువైపులా ఈ వ్యర్థపదార్థాలు వేయడంతో ముక్కుమూసుకొని ప్రయాణం చేస్తున్నాం. అలాగే కుక్కల బెడద ఎక్కువైంది. అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. ఎవరూ తిరగనిచోట ఈ వ్యర్థాలు వేస్తే మేలు జరుగుతుంది.

– రేవూరి కృష్ణ, నాగాయపేట, పెనగలూరు మండలం

ఐక్యతతో రాజకీయాల్లో రాణించాలి

రాయచోటి అర్బన్ : ముస్లిం, మైనార్టీలు ఐక్యతతో ముందుకెళుతూ రాజకీయంగా రాణించాలని రాయచోటి మైనార్టీ నేత సలావుద్దీన్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆల్‌మేవా అన్నమయ్య జిల్లా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మైనార్టీలలో ఐక్యత లోపించడంతో అభివృద్ధికి దూరమవుతున్నారన్నారు. ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడు జుబేర్ అలీ ఖాన్ మాట్లాడుతూ మైనార్టీ ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆల్‌మేవా దృష్టికి తీసుకవచ్చి పరిష్కరింపజేసుకోవాలంటూ కోరారు. జిల్లా కార్యదర్శి అసదుల్లా మాట్లాడుతూ మైనార్టీలు బాగా చదువుకుని అన్నిరంగాలలో పురోగమించాలంటూ కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఆల్‌మేవా రాష్ట్రప్రధాన కార్యదర్శి అంజద్‌బాషా, నేతలు మునాఫ్, సునీర్, హషీమ్, సబాతుర్ రహిమాన్, ఇంతియాజ్, హబీబుల్లా, ఇర్ఫాన్‌అలీతోపాటు పలువురు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఆల్‌మేవా నేతలు

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

రాయచోటి జగదాంబసెంటర్ : అమ్మవారి దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి మున్సిపల్ పరిధిలోని పాతగొల్లపల్లిలో గ్రామ దేవత పాతపల్లెమ్మ దేవర సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఇచ్చిన విందులో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. వీరనాగన్న, రామాంజులు, శ్రీను, మోహన్, నాగార్జున, ప్రసాద్, వెంకటరమణ, నాగేశ్వరి తదితర కార్యకర్తల నివాసాలకు వెళ్లిన శ్రీకాంత్‌రెడ్డికి ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు పలికారు. ఆయన వెంట సర్పంచ్ రామాంజులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు అమరనాథరెడ్డి, కొత్తిమీర ప్రసాద్ తదితరులు ఉన్నారు.



విందులో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి

వివాహ వేడుకలో ఎంపీపీ

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త కరీముల్లా బేగ్ కుమారుడు జాఫర్ వివాహానికి ఆదివారం మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లికి హాజరైన మైనార్టీలను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆయనతోపాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఈ వివాహ వేడుకలలో పాల్గొన్నారు.

అంజన్నకు పూజలు

పుల్లంపేట : మండలంలోని అనంతపల్లిలోని కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా స్వామి వారు ప్రతీతి. ఆలయంలో వేకువజాము నుంచే స్వామివారికి పూజలు జరిపి ప్రత్యేక అలంకరించారు. ఆదివారం స్వామిని భక్తులు దర్శించుకుని కాయా, కర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నూతన నియామకం



దాడిశెట్టి సిద్దూ రాయల్

రైల్వేకోడూరు అర్బన్ : అనంతపురం రీజియన్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా దాడిశెట్టి సిద్దూరాయల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం మినిస్ట్రీ ఆఫ్ టెలీకమ్యూనికేషన్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ (న్యూఢిల్లీ) డైరెక్టర్ ఊర్వశీ సాంగ్వాన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా సిద్దూ మాట్లాడుతూ వైఎస్సార్సీపీలో తన సేవలు గుర్తించి తనపై నమ్మకంతో బీఎస్ఎన్ఎల్ టీఏసీ సభ్యుడిగా నియామకానికి కృషి చేసిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

రాయచోటి టౌన్ : విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజ్ సమస్య తలెత్తకుండా చూడాలని రాయచోటి విద్యుత్‌శాఖ అధికారులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని తిరుపతి నాయుడు కాలనీలో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని అందులో లో ఓల్టేజ్ సమస్య రాకుండా చూడాలని సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించినప్పుడే సంతృప్తి ఉంటుందని చెప్పారు.

పాలకులకు ఆదర్శం శ్రీ కృష్ణదేవరాయలు



రాయలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ఆదివారం వైఎస్సార్సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ సర్కిల్ వద్దవున్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలు వారి పరిపాలన నేటి పాలకులకు ఆదర్శం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రపంచ చరిత్రలో గుర్తు పెట్టుకోవాల్సిన వ్యక్తని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచ్ శివయ్య, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, నందబాల, హరికృష్ణ, బండారు మల్లి, మహేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దామర్ల సిద్దయ్య, డీవీ రమణ, గల్లా శ్రీనివాసులు, ఫరూక్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై అక్రమ కట్టడాలు

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీ సర్వేనెంబర్ 870/3 నిర్మలగిరి కాలనీలో పంచాయతీ రస్తాకు అడ్డంగా అక్రమంగా గోడ కట్టడాలను నిర్మించి రహదారిని పూర్తిగా ఆక్రమించారు. నిర్మలగిరి కాలనీ సర్వేనెంబర్ 870/3లో 2006వ సంవత్సరంలో రెవన్యూ లేఔట్‌లో పబ్లిక్ రస్తాగా గుర్తించారు. ఆ ప్రాంతంలో నివాసం ఉన్న 60 కుటుంబాల వారికి, పంట పొలాలకు వెళ్లే రైతులు ఇదే రహదారిన వెళుతుంటారు. ఒకవ్యక్తి రహదారికి అడ్డంగా గత బుధవారం రాత్రికి రాత్రే రహదారికి అడ్డంగా అక్రమ కట్టడాలను నిర్మించారని స్థానికులు తెలిపారు. నడిచేందుకు దారిలేకుండా రహదారిని అన్యాక్రాంతం చేశారన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి రహదారికి అడ్డంగా ఉన్న కట్టడాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతను వివరణ కోరగా రహదారికి అడ్డంగా అక్రమ కట్టడాలను నిర్మించి ఉంటే రికార్డులను పరిశీలించి కట్టడాలను తొలగిస్తామని ఆమె పేర్కొన్నారు.



నిర్మలగిరి కాలనీలో దారికి అడ్డంగా నిర్మించిన గోడ

చికెన్ కొనుగోలుపై ప్రజల అనాసక్తి



కొనుగోలుదారులతో కిక్కిరిసిన రాజంపేటలోని చేపల మార్కెట్

- స్పష్టంగా కనిపించిన బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్
- జోరుగా సాగిన చేపల విక్రయాలు

రాజంపేట టౌన్ : బర్డ్ ఫ్లూ ప్రభావం ఆదివారం చికెన్ వ్యాపారంపై స్పష్టంగా కనిపించింది. జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు స్పష్టం చేసినప్పటికీ ప్రజలు మాత్రం చికెన్ తినేందుకు వెనుకాడారు. దీంతో జిల్లాలో దాదాపు డెబ్బై శాతానికి పైగా చికెన్ విక్రయాలు పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇక ఓ మోస్తారు గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న దుకాణాల్లో ఆదివారం 15 నుంచి 20 కేజీల వరకు చికెన్ విక్రయాలు జరుగుతాయి. అయితే అలాంటి దుకాణాల్లో కేవలం మూడు, నాలుగు కేజీల చికెన్ మాత్రమే అమ్ముడుపోయినట్లు వ్యాపారులు తెలిపారు. సాధారణంగా ధర తక్కువ కావడం వల్ల మాంసం ప్రియులు చికెన్ తినేందుకు ఇష్టపడతారు. అయితే గత కొన్ని రోజులుగా రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ, కృష్ణాజిల్లాలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి లక్షలాది కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో బర్డ్ ఫ్లూపై ఇటు పత్రికల్లోను అటు న్యూస్ ఛానల్స్‌లోను విస్తృతంగా వార్తలు వెలువడ్డాయి. దీంతో మాంసం ప్రియులు చికెన్ జోలికి వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. అందువల్ల ఆదివారం జోరుగా సాగాల్సిన చికెన్ విక్రయాలు దారుణంగా పడిపోయాయి. అతికొద్ది మంది మాత్రమే చికెన్ కొనుగోలు చేయగా, వారిలో ఎక్కువ శాతం మంది దినసరి కూలీలే ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇదిలావుంటే ముక్కలేనిదే ఆదివారం గడవని మాంసం ప్రియులు మాంసం ధరలు అధికంగా ఉండటం వల్ల తక్కువ ధరకు వచ్చే చేపలను కొనుగోలు చేశారు. దీంతో చేపల విక్రయ ప్రాంతాలు సంత వాతావరణాన్ని తలపించాయి. వేకువజాము నుంచే మాంసం ప్రియులు మార్కెట్‌కు వచ్చి చేపలను కొనుగోలు చేశారు. చేపల విక్రయాలు హాట్ కేకుల్లా జరగడంతో చాలా మందికి చేపలు దొరకని పరిస్థితి నెలకొంది. ఇదిలావుంటే ఆదివారం ముక్కలేనిదే ముద్ద దిగని వారు చేపలు కూడా దొరకని పరిస్థితుల్లో మాంసం కొనుగోలు చేశారు. అందువల్ల మాంసపు దుకాణాల వద్ద కూడా రద్దీ కనిపించింది.



పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో వెలవెలబోతున్న చికెన్ దుకాణం

రామాయణ సదస్సుకు పసుపులేటికి ఆహ్వానం

నందలూరు : తెలుగులో రామాయణాలు సామాజిక దృక్పథం అనే అంశంపై కడప చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ శాస్త్ర గ్రంథాలయంలో అంతర్జాతీయ స్థాయి సదస్సులో ఉపన్యాసించమని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, ఒంటిమిట్ట శ్రీ పోతన సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి శంకర్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆదివారం శంకర్ మాట్లాడుతూ భారతీయ భాషా సంస్థలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యాయన కేంద్రం యోగివేమన విశ్వవిద్యాలయానికి చెందిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 18, 19వ తేదీలలో సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సదస్సులో భాషా పండితులు, ఆచార్యులు, విశ్వవిద్యాలయలకు సంబంధించిన ప్రముఖులు, పలువురు పండితులు పాల్గొంటారని వారు తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆహ్వాన పత్రంలో పేర్కొన్నారు.

అనాలోచిత నిర్ణయం.. అవస్థలమయం

పట్టణంలో ఉండాల్సిన పీహెచ్‌సీని రూరల్‌లో ఏర్పాటు

- ఇబ్బందులు పడుతున్న రోగులు
- ఓ వైద్యాధికారి నిర్వాకంతో ఆపసోపాలు పడుతున్న ప్రజలు
- అందుబాటులోకి తేవాలంటూ నందలూరు వాసుల డిమాండ్



అటవీ శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన నందలూరు-1 ఆరోగ్య ఉపకేంద్రం



నందలూరు గ్రామంలోని ఒకటవ సచివాలయం

రాజంపేట : సచివాలయం ఉండే చోటే ఆరోగ్య ఉపకేంద్రం ఉండాలి. అలా కాకుండా వేరే సచివాలయం పరిధిలో ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటుతో నందలూరు సచివాలయ పరిధిలోని రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదెక్కడో కాదు నియోజకవర్గ పరిధిలోని నందలూరు గ్రామ సచివాలయ పరిధిలో చోటుచేసుకుంది. ఇప్పటికీ ఈ సమస్య అలాగే కొనసాగుతోంది. కనీసం మార్పు చేయాలన్న ఆలోచనను వైద్య ఆరోగ్యశాఖ చేయడం లేదన్న విమర్శలు పేదవర్గాల నుంచి వినిపిస్తోంది. పొరపాటును సరిచేయడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

చికిత్సకు రెండు కిలోమీటర్లు పోవాల్సిందే

సబ్‌సెంటర్‌లు, సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు క్రమంలో గతంలో పనిచేసిన ఓ వైద్యాధికారి సక్రమంగా మ్యాపింగ్ చేయకపోవడంతో సచివాలయం – 1కు సంబంధించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని రెండవ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేశారు. నందలూరు గ్రామానికి అటవీ ప్రాంత శివార్లలో దాదాపు 2 కిలోమీటర్ల మేర దూరంలో ఉపకేంద్రంను కొనసాగిస్తున్నారు. టౌన్‌లో ఉండాల్సిన ఉప కేంద్రాన్ని రూరల్ ప్రాంతంలో ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకటవ సచివాలయంలో ఉండాల్సిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎలా మారుస్తారని వైద్యులను ప్రశ్నించినా కేంద్రాన్ని మార్చేందుకు చర్యలు చేపట్టలేదు.

వెలువెత్తుతున్న విమర్శలు

వైద్య ఆరోగ్యశాఖ అనాలోచిత నిర్ణయంపై ప్రజలు, ప్రజాప్రతినిధులు విమర్శలు చేస్తున్నారు. పట్టణంలో ఉన్న ప్రజలు అనారోగ్య పరిస్థితుల్లో చికిత్స కోసం రూరల్ ప్రాంతాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. ఓ వైద్యాధికారి నిర్లక్ష్యం కారణంగా తాము నానా అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రిలో వైద్యుడికి చూపించుకోవాలంటే జేబుకు చిల్లుపడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నందలూరు 1 సచివాలయం పరిధిలో ఆరోగ్య ఉపకేంద్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను నందలూరు వాసులు కోరుతున్నారు.

పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు



నందలూరు 1 సచివాలయం పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రంను నందలూరు సచివాలయం-1 పరిధిలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించాం. మ్యాపింగ్‌లో ఓ వైద్యుడు చేసిన నిర్వాకం వల్ల ఈరోజు పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు కోరినా స్పందన లేదు. ఇప్పటికైనా నందలూరు-1 సచివాలయ పరిధిలోనే ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

– పెనుబాల నాగసుబ్బయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, నందలూరు

ఉపకేంద్రాన్ని మార్చాలి



నందలూరు-1 సచివాలయం ఆరోగ్య ఉపకేంద్రాన్ని రూరల్ ఏరియాలో ఏర్పాటు చేశారు. దీనిని మార్చి అధికారులు తమ తప్పును సరిదిద్దుకోవాలి. ఆ దిశగా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలి. అటవీ శివారు ప్రాంతంలో ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు అప్పుడో తాము వ్యతిరేకించాం. వైద్యులను కూడా నిలదీశాం. ఏకపక్ష ధోరణిలో నిర్ణయం పేదలకు శాపంగా మారింది.

– సోమిశెట్టి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీనేత, నందలూరు

గుంటిమడుగు సుధాకర్‌రాజు లేకపోవడం తీరనిలోటు



గుంటిమడుగు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు గుంటిమడుగు సుధాకర్‌రాజు మన మధ్యలో లేకపోవడం తీరనిలోటని ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సుధాకర్‌రాజు దశదిన కర్మ కార్యక్రమాలలో ఆయన పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ప్రతి నిత్యం తోడుగా, స్నేహితుడిగా దగ్గరుండి చూసుకునేవాడని గుర్తు చేసుకొన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో నిత్యం తన వెంట ఉండేవాడని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి దూరమవ్వడం బాధాకరమన్నారు. నిత్యం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరిని ప్రోత్సహించే వారని చెప్పారు. వైఎస్సార్సీపీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ముప్పాల హేమనవర్మ, సుబ్బరామరాజు, మలిశెట్టి వెంకటరమణ, మహేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, మందల నాగేంద్ర, సీహెచ్ రమేష్, డీవీ రమణ, సిద్దయ్య, బండారు మల్లి, హరికృష్ణారెడ్డి, మహేష్‌రెడ్డి, నందబాల తదితరులు పాల్గొన్నారు.